ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 27 మార్చి 2024

పాపం ఓపీఎస్!

మాజీ సీఎం పేరుతో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు



మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒ.పన్నీర్‌సెల్వం

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అసమ్మతి వర్గ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) కొత్త సమస్యతో సతమతమవుతున్నారు. ఎన్డీయే కూటమిలో చేరితే కనీసం రెండు సీట్లయినా దక్కుతాయనుకున్న ఆయనకు నిరాశే మిగిలింది. ఓపీఎస్ వర్గానికి రామనాథపురం నియోజకవర్గాన్ని మాత్రమే కేటాయించారు. దీంతో ఆయనే పోటీకి దిగి నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ గుర్తుపై పోటీ చేయనున్న ఓపీఎస్‌కు కొత్త సమస్య ఎదురైంది. రామనాథపురం నియోజకవర్గంలో ఒ.పన్నీర్‌సెల్వం అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తన పేరు కలిగిన సదరు వ్యక్తి మదురై సమీపం ఉసిలంపట్టికి చెందినవాడని తెలుసుకుని డీలాపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఒ. పన్నీర్‌సెల్వం పేరు కలిగిన మరో నలుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇలా ఒకే పేరుతో ఐదుగురు స్వతంత్రులు వేర్వేరు గుర్తులపై పోటీ చేస్తే ఓటర్లు అయోమయంలో పడటం ఖాయమని ఓపీఎస్ ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక ఓపీఎస్ తలపట్టుకు కూర్చున్నారు.

బీజేపీ ప్రచారానికి దూరంగా ఖుష్బూ?



అడయార్, మార్చి 26: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూను బీజేపీ దూరం పెట్టింది. తాజాగా పార్టీలో చేరిన మరో సీనియర్ నటి రాధికా శరత్ కుమార్‌కు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీటును కేటాయించడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో లోలోపల కుమిలిపోతున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పెద్దలు అన్నామలై, ఎల్.మురుగన్, తమిళిసై సౌందరరాజన్, రాధికా శరత్‌కుమార్ వంటి ముఖ్యులకు సీటు కేటాయించింది. ఆ కోణంలో చూస్తే ఖుష్బూకు కూడా బీజేపీ పెద్దలు సీటు కేటాయించాల్సి ఉంది. కానీ, ఆమెకు మొండి చేయి చూపించారు. నిజానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖుష్బూ పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో చెన్నై జిల్లాలోని మూడు లోక్‌సభ స్థానాల్లో ఏదో ఒక స్థానాన్ని ఆమెకు కేటాయిస్తారని భావించారు. కానీ, ఆమెకు అవకాశం ఇవ్వలేదు. ఇదే విషయంపై బీజేపీ వర్గాలను పలకరించగా, ఎక్కడ ఏం మాట్లాడాలో ఖుష్బూకు ఇంకా తెలియలేదని, తమిళనాడు ప్రభుత్వం మహిళలకు ప్రతి నెలా ఇస్తున్న రూ.1000ను భిక్షగా వ్యాఖ్యానించడం, రాష్ట్రంలో వివాదమైందన్నారు. ఈ వ్యాఖ్యలు పార్టీ అధిష్ఠానానికి ఆగ్రహం తెప్పించాయంటున్నారు. అలాగే, రాష్ట్రంలోని మహిళలు కూడా ఖుష్బూ పట్ల సానుకూలంగా లేరని, అందువల్ల ఆమెకు సీటు ఇస్తే ఓడిపోతారన్న భావనతో కేటాయించలేదని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇప్పుడు మార్పు రాకుంటే

మరెప్పుడూ రాబోదు!

- ప్రజలకు అన్నామలై పిలుపు



పెరంబూర్, మార్చి 26: ఇప్పుడు మార్పు రాకుంటే మరెప్పుడూ రాదని, అందుకోసం తాను నిరంతరం శ్రమిస్తున్నానంటూ కోయంబత్తూర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అన్నామలై అన్నారు. కోవై లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని తిరుప్పూర్ జిల్లా పల్లడం శాసనసభ నియోజకవర్గంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో అన్నామలై పాల్గొని, ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ... ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు వ్యత్యాసమైనవని, ఈ ఎన్నికల్లో బీజేపీ తప్పక గెలవాల్సి ఉందన్నారు. 400 స్థానాలు బీజేపీ చేజిక్కించుకొనేలా ఓటర్లు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకోసం విరామం లేకుండా శ్రమిస్తున్నారన్నారు. తన తల్లిని చూసి రెండు నెలలు గడిచిందన్నారు. ఈ నియోజకవర్గ ప్రస్తుత ఎంపీ ఎవరో కూడా ప్రజలకు తెలియదని, కానీ తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నో సార్లు నియోజకవర్గంలో పర్యటించానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అవసరమని, తనకు అవకాశం కల్పిస్తే సాధించుకు వస్తానని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో 50 శాతం వ్యవసాయం పెరిగిందని, కానీ, రాష్ట్రంలో 14 శాతం తగ్గిందన్నారు. బీజేపీ కూటమి అభ్యర్థులను 40 నియోజకవర్గాల్లో గెలిపించాల్సిన అవసరం తనపై ఉందన్నారు. అందువల్లే తాను కలుసుకోలేదని భావించకుండా, మోదీయే అన్నామలై అనుకొని ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరో ఐదేళ్ల మీకు సేవ చేసుకొనే అవకాశం తనకు కల్పించేందుకు మరో 25 రోజులు మాత్రమే ఉన్నాయని అన్నారు. ఈ నియోజకవర్గ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మంత్రి టీఆర్బీ రాజా డబ్బు సంచులతో తిరుగుతున్నారన్నారు. కోవైను వ్యవసాయం, పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు చేపడతానని అన్నామలై హామీ ఇచ్చారు.

స్వస్థలం ఒక చోట...

పోటీ మరో చోట

- అదృష్టం పరీక్షించుకోనున్న 'స్థానికేతరులు'



దురైవైగో, అన్నామలై, ఎల్. మురుగన్, ఎ. రాజా

ప్యారీస్, మార్చి 26: రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ తమకు విజయావకాశాలు మెండుగా ఉన్న నియోజకవర్గాల్లో స్థానికేతరులను అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిపాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల ప్రజలతో సంబంధాలు, వ్యక్తిగత పలుకుబడి కలిగిన వారిని అభ్యర్థులుగా ప్రకటించిన పార్టీలు, ఈ దఫా సంస్కృతిని పాటించకుండా స్థానికేతరులకు అవకాశం కల్పించాయి. డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ, కాంగ్రెస్, ఎండీఎంకే, డీఎండీకే, ఎన్టీకే, ఐయూఎంఎల్, ఎస్డీపీఐ తరఫున అభ్యర్థులు బరిలో నిలిచారు. తమ నియోజకవర్గాల్లో స్థానికేతరులను అభ్యర్థులుగా బరిలో నిలిపిన కారణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తికి లోనయ్యారు. అయినప్పటికీ, అధిష్ఠానాల మెప్పు పొందేందుకు అభ్యర్థులతో కలసి ప్రచారంలో పాల్గొంటున్నారు. తిరునెల్వేలి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా రాబర్ట్ బ్రూస్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించిన వెంటనే ఆ పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 62 ఏళ్ల రాబర్ట్ కన్నియాకుమారికి చెందిన వారని, నియోజకవర్గంతో ఎలాంటి సంబంధం లేని ఆయనకు స్థానిక ఓటర్లు వేసేందుకు ముందుకు రారని నెల్లై జిల్లా కాంగ్రెస్ యువజన విభాగ మాజీ అధ్యక్షుడు ముత్తురామలింగం సహా పలువురు నాయకులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బీజేపీలో కూడా ఇదే పరిస్థితి. ఆ పార్టీ ఓబీసీ విభాగ రాష్ట్ర కార్యదర్శి సురేష్ తన ఎక్స్ పేజీలో... స్థానికంగా ఓటు హక్కు ఉన్న వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటిస్తే గెలిచే అవకాశముంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తిరుచ్చి నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున ఏఎంఎంకేకు కేటాయించారని, అందువల్ల ఆ స్థానంలో పోటీ చేయాల్సిన స్థానిక నేత రామశ్రీనివాసన్‌ను మదురై నియోజకవర్గంలో పోటీచేసే అవకాశం కల్పించారని, ఆయన గెలవడం ప్రశ్నార్థకమేనని తెలిపారు. ఈ రకంగా కాంగ్రెస్, బీజేపీలు మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రధాన పార్టీలు కూడా స్థానికేతురులనే పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులుగా ప్రకటించాయి. నీలగిరి (రిజర్వుడు) నియోజకవర్గంలో పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థి ఎ.రాజా పెరంబలూరుకు చెందిన వారు. అదే నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎల్. మురుగన్ నామక్కల్ జిల్లాకు చెందిన వారు. ఇక, కరూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కోయంబత్తూర్‌లో పోటీ చేస్తున్నారు. కోవైకి చెందిన కృష్ణస్వామి తెన్‌కాశిలో ఎన్నికల బరిలో నిలిచారు. వీఐపీ నియోజకవర్గంగా మారిన విరుదునగర్‌లో బీజేపీ తరఫున సినీనటి రాధిక శరత్ కుమార్, డీఎండీకే అభ్యర్థిగా దివంగత నటుడు విజయకాంత్ కుమారుడు విజయ ప్రభాకరన్ అన్నాడీఎంకే కూటమి తరఫున ఢంకా గుర్తుపై పోటీ చేస్తున్నారు. వీరివురూ చెన్నై చెందిన వారైనప్పటికీ, విరుదునగర్‌లో పోటీ చేయడం గమనార్హం. అన్నాడీఎంకే బహిష్కృత నేత ఒ.పన్నీర్ సెల్వం బీజేపీ కూటమి తరఫున రామనాథపురంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ఆయన సొంత నియోజకవర్గం తేని. అలాగే, విరుదునగర్‌కు చెందిన ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో కుమారుడు దురై వైగో డీఎంకే కూటమి తరఫున తిరుచ్చి ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో, వచ్చే నెల 19న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు దేవుళ్లు వీరిని గెలిపిస్తారో లేదు వేచి చూడాల్సి ఉంది. ఇదంతా ఒక్క ఎత్తైతే మంగళవారం బాగా పొద్దుపోయాక కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు కూటమిలో తమకు కేటాయించిన లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా ఆర్. సుధను ప్రకటించింది. ఈమె గురించి వివరాలు తెలియాల్సి ఉంది.



టెన్త్ పరీక్షలు ప్రారంభం

- ప్రశాంతంగా ముగిసిన తొలిరోజు పరీక్ష
- చెన్నైలో 66,771 మంది విద్యార్థులు

అడయార్, మార్చి 26: పుదుచ్చేరితో పాటు తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా టెన్త్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షలకు రెండు రాష్ట్రాల్లో కలిపి 9.38 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వార్షిక పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఈ నెల 1న ప్లస్‌టూ పరీక్షలు ప్రారంభమై 22వ తేదీతో ముగిశాయి. ఈ పరీక్షలకు 7.25 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే, ప్లస్ వన్ పరీక్షలు మార్చి 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 8 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభించగా, వచ్చే నెల 8వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షల్లో భాగంగా తమిళనాడు, పుదుచ్చేరిలో 12,616 పాఠశాలలకు చెందిన 9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బాలురు 4,57,525 మంది, బాలికలు 4,52,498 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ విద్యార్థి ఒకరు ఉన్నారు. వీరే కాకుండా ప్రైవేటు విద్యార్థులు మరో 28,827 మంది, ఖైదీలు 235 మందితో కలుపుకుని మొత్తం 9.38 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో భాగంగా తొలి రోజున లాంగ్వేజ్ పరీక్ష జరగ్గా, 28వ తేదీన ఆంగ్లం, ఏప్రిల్ 1న గణితం, 4న సైన్స్, 6న చాయిస్ లాంగ్వేజ్, 8న సోషల్ సైన్స్ జరగనున్నాయి. ఒక్క చెన్నై లోనే 810 పాఠశాలలకు చెందిన 66,771 మంది విద్యార్థులు 288 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్ష సమయం కేటాయించారు. ఏప్రిల్ 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుంది. మే 10న పరీక్షా ఫలితాలను వెల్లడించే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

17,633 మంది గైర్హాజరు

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో తొలిరోజు నిర్వహించిన తమిళం, ఇతర మాతృభాషల పరీక్షకు 17,633 మంది విద్యార్థులు హాజరుకాలేదని అధికారులు తెలిపారు.

నేటితో ముగియనున్న

నామినేషన్ల ఘట్టం

- 30న చిహ్నాల కేటాయింపు

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 39 లోక్‌సభ నియోజకవర్గాలకు, పుదుచ్చేరి నియోజకవర్గానికి ఏప్రిల్ 18న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం బుధవారం ముగియనుంది. గత రెండు రోజులుగా ప్రధాన పార్టీల అభ్యర్థులంతా నామినేషన్లు దాఖలు చేయడంలోనే తలమునకలయ్యారు. ప్రధాన పార్టీల నేతలంతా ఇప్పటికే సుడిగాలి పర్యటనలతో ప్రచారం చేస్తున్నారు. ఇక డీఎంకే సీనియర్ నేతలు, మంత్రులు, అన్నాడీఎంకే మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, బీజేపీ సీనియర్ నేతలు, శాసనసభ్యులు, వామపక్షాల నాయకులు ప్రచార పర్యటనలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20 ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ బుధవారం ముగియనుంది. డీఎంకే కూటమిలో 20 శాతం అభ్యర్థులు చివరి రోజైన బుధవారం నామినేషన్లు దాఖలు చేయడానికి సిద్ధమవుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కోయంబత్తూరులో బుధవారం నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేపడుతున్నారు. చిదంబరంలో పోటీ చేస్తున్న డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ కూడా బుధవారమే నామినేషన్ సమర్పించనున్నారు. కాంగ్రెస్‌కు చెందిన తొమ్మిది మంది అభ్యర్థులు, పుదుచ్చేరిలో అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేస్తారు. కాంగ్రెస్ అధిష్ఠానం మైలాడుదురై నియోజకవర్గ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేని పరిస్థితిలో ఉంది. బుధవారం ఉదయం లోగా ఆ నియోజకవర్గం అభ్యర్థిని, పుదుచ్చేరి అభ్యర్థిని ఎంపిక చేయాల్సి ఉంది. సోమవారం సాయంత్రం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 405 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

పడవ చిహ్నం కోసం సీమాన్ పట్టు...

ఇదిలా ఉండగా నామ్‌తమిళర్ కట్చి తమకు పడవ చిహ్నం కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. నామ్‌తమిళర్ కట్చి చిహ్నమైన చెరకు రైతు గుర్తు కర్ణాటకలోని ఓ పార్టీకి ఎన్నికల సంఘం కేటాయించడంతో ఆ చిహ్నం కోసం సీమాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెరకు రైతు గుర్తు రాకుంటే పడవ, అగ్గిపెట్టె, విజిల్ చిహ్నాల్లో ఒకదాన్ని కేటాయించాలని మంగళవారం ఆయన ఎన్నికలసంఘానికి దరఖాస్తు పెట్టుకున్నారు.

ఇప్పటి వరకు 737 నామినేషన్లు

నేటితో గడువు ముగినున్న నేపథ్యంలో ఈనెల 20వ తేది 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే 21న 9 మంది, 22న 47 మంది, 25న 402 మంది, 26న 259 మంది తమ నామినేషన్లను ఆర్‌ఓకు అప్పగించారు.

మోదీపైనే నమ్మకం పెట్టుకున్న బీజేపీ

- డీఎంకే ఎంపీ కనిమొళి



తూత్తుకుడి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కనిమొళి

ప్యారీస్, మార్చి 26: కమలం పార్టీ కేవలం ప్రధాని నరేంద్రమోదీనే నమ్ముకుందని, అయితే ఇండియా కూటమి దేశ ప్రజలందర్నీ నమ్ముకొని పని చేస్తుందని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కనిమొళి మళ్లీ తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గంలో ఎంపీగా పోటీచేసేందుకు మంగళవారం ఉదయం నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... మతవాద బీజేపీ ప్రతి కదలికను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఎలక్టోరల్ బాండ్ల మోసంపై వాస్తవాలు ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నాయన్నారు. తమ ప్రత్యర్థులపై పగ తీర్చుకొనేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను పావులుగా ఉపయోగించుకుంటోందని, ఇందులో భాగంగానే 2జీ స్పెక్ట్రమ్ కేసును బీజేపీ మళ్లీ చేతికి తీసుకుందని విమర్శించారు. ఇలాంటి తనిఖీలు, అరెస్టులతో డీఎంకే బెదిరిపోదన్నారు.

ఆరు ప్రాంతాల్లో 100 డిగ్రీల ఫారన్‌హీట్ నమోదు



పెరంబూర్, మార్చి 26: రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత అధికమవుతోంది. మంగళవారం ఆరు ప్రాంతాల్లో 100 డిగ్రీ ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈరోడ్‌లో 102 డిగ్రీల ఫారన్‌హీట్ (38.8 డిగ్రీల సెల్సియస్), సేలం, నామక్కల్‌లో 101 డిగ్రీలు (38.3 డిగ్రీల సెల్సియస్), ధర్మపురి, కరూర్ పరమత్తి, తిరుపత్తూర్, మదురై ప్రాంతాల్లో 100 డిగ్రీల ఫారన్‌హీట్ (37.7 డిగ్రీల సెల్సియస్) ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మైలాడుదురై కాంగ్రెస్ అభ్యర్థిగా న్యాయవాది సుధ



చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో 9 స్థానాలను దక్కించుకున్న కాంగ్రెస్ ఎట్టకేలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ముగించింది. రాష్ట్రంలోని ఎనిమిది స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్... మైలాడుదురై ఎంపికలో తీవ్ర మల్లాగుల్లాలు పడింది. నలువైపులనుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి సరైన అభ్యర్థి ఎంపికలో నెలకొన్న సమస్యల కారణంగా మంగళవారం సాయంత్రం వరకు ఈ వ్యవహారాన్ని నాన్చి చివరికి న్యాయవాది ఆర్.సుధను అభ్యర్థిగా ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటన జారీ చేశారు.



కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారానికి కమల్ 'నో'



కమల్‌తో భేటీ అయిన దయానిధి మారన్, కళానిధి వీరాసామి, శేఖర్‌బాబు, ప్రియ తదితరులు

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఎంకేతో పొత్తు పెట్టుకున్న మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమలహాసన్ కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడానికి ససేమిరా కుదరదంటూ భీష్మించారు. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్‌కు లభించే పది స్థానాల్లో ఒకట్రెండు స్థానాలు తమ పార్టీకి కేటాయిస్తారని మక్కల్ నీదిమయ్యం నేతలంతా ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడానికి ముందు పార్టీ నిర్వాహకుల సమావేశంలో కాంగ్రెస్ తమ పార్టీకి ఒకటి లేదా రెండు సీట్లు కేటాయిస్తుందని భావించి రెండు రోజుల్లో అందరికీ శుభవార్త చెబుతానని ప్రకటించారు. ఆ తర్వాత డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ సహా అన్ని మిత్రపక్షాలు సీట్లకేటాయింపులు పూర్తయ్యాయి. కానీ కాంగ్రెస్ తమకు కేటాయించిన పుదుచ్చేరి సహా పది సీట్లలో ఒకటి రెండు సీట్లను కమల్‌కి కేటాయించడం కుదరదంటూ తేల్చి చెప్పింది. దీంతో దిగ్భ్రాంతి చెందిన కమల్ ఒంటరి పోరుకు దిగుదామని అనుకుంటుండగా డీఎంకే అధిష్ఠానం నుంచి పిలుపురావటం, 2025లో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో ఒక సీటును మక్కల్ నీది మయ్యంకు కేటాయించేలా ఒప్పందం ఆగమేఘాలపై కుదిరింది. దీంతో సంతృప్తి చెందిన కమల్ కాంగ్రెస్ మినహా డీఎంకే కూటమిలోని అన్ని మిత్రపక్షాల అభ్యర్థులకు మాత్రమే ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఆ దిశగానే తన ప్రచార పర్యటన కార్యక్రమాలను కూడా రూపొందించుకున్నారు.

ప్రచారం ఇలా...

ఈనెల 29 నుంచి ఏప్రిల్ 16 వరకు ఆయన డీఎంకే, డీపీఐ, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయన్నారు. ఈనెల 29న ఈరోడ్‌లో డీఎంకే అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తారు. 30న సేలంలో డీఎంకే అభ్యర్థికి మద్దతుగా, ఏప్రిల్ 2న తిరుచ్చిలో ఎండీఎంకే అభ్యర్థి దురై వైగోకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఏప్రిల్ 3న చిదంబరంలో డీపీఐ నేత తిరుమావళవన్‌కు మద్దతుగా, 6న చెన్నైలో డీఎంకే అభ్యర్థులకు మద్దతుగా, అదే రోజు శ్రీపెరుంబుదూరులో ప్రచారం చేస్తారు. ఏప్రిల్ 7న కూడా చెన్నైలోనే ప్రచారం చేస్తారు. ఏప్రిల్ 10న మదురైలో సీపీఎం అభ్యర్థికి మద్దతుగా, 11న తూత్తుకుడిలో డీఎంకే అభ్యర్థి కనిమొళి కోసం ప్రచారం చేస్తారు. ఏప్రిల్ 14న తిరుప్పూరులో, 15న కోయంబత్తూరులో, 16న పొల్లాచ్చిలో ప్రచారం చేయనున్నారు. ఈ 11 రోజుల ప్రచార పర్యటనలో ఎక్కడా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేసే అవకాశమే లేదు. ఈ పరిస్థితులలో తమ పార్టీ అభ్యర్థులకు కమల్ ప్రచారం చేసేలా టీఎన్‌సీసీ నేతలు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, మాజీ అధ్యక్షుడు తంగబాలు తదితర నాయకులు కమల్‌ను కలుసుకుని కాంగ్రెస్ తరఫున కూడా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ సందర్భంగా కమల్ హాసన్ కాంగ్రెస్ నేతలకు ప్రచారం చేస్తానని గానీ, ప్రచారం చేయనని గానీ చెప్పకుండా చిరునవ్వుతో కాంగ్రెస్ నేతలను సాగనంపారు.

కూటమి నేతలతో మారన్ వరుస భేటీలు

అడయార్: లోక్‌సభ ఎన్నికల్లో సెంట్రల్ చెన్నై నుంచి డీఎంకే అభ్యర్థిగా మరోమారు అదృష్టాన్ని పరీక్షించుకోనున్న దయానిధి మారన్.. విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులోభాగంగా, డీఎంకే భాగస్వామ్య పార్టీల నేతలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం సత్యమూర్తి భవన్‌లో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంధగైతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలను కలుసుకుని మద్దతు కోరారు. అలాగే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధినేత ఖాదర్ మొహిద్దీన్‌ను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు.

సమాచార ధ్వని

నేడు పీఎఫ్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, మార్చి 26: రాష్ట్రవ్యాప్తంగా పీఎఫ్ గ్రీవెన్స్ బుధవారం జరగనుంది. డీఎంఎస్ ప్రాంగణంలో ఉన్న పీఎఫ్ కార్యాలయం, అంబత్తూర్ సిండి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, తాంబరం ఎల్ఎల్ఎం అప్లైన్స్, వేలూరు ఈఎస్ఐసీ ఆసుపత్రి, తిరువణ్ణామలై మేల్పులిది యూరు, రాణిపేట సీఎస్ఐ ఆసుపత్రి, తిరుపత్తూర్, పుదుచ్చేరిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే గ్రీవెన్స్‌లో చందాదారులు, పింఛన్‌దారులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చు.

ఫార్మశీ ఉపాధ్యాయులకు శిక్షణ

ఐసిఎఫ్, మార్చి 26: ఎలా బోధించాలో తెలియని ఫార్మశీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ అనుమతి కోరనుంది. రాష్ట్రంలో రెండు ప్రభుత్వ వైద్య కళాశాలలు సహా 92 ఫార్మశీ కళాశాలలున్నాయి. ఒక్కో కళాశాలలో తలా 30 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఎక్కువ మంది టీచర్లు పీజీ కోర్సు పూర్తికాగానే విధుల్లో చేరుతున్నారు. తగిన అనుభవం లేకపోవడంతో క్షుణ్ణంగా పాఠాలు బోధించలేకపోతున్నారు. అలాంటి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకుంది.

ముగిసిన పర్యాటక ఎగ్జిబిషన్

ఐసిఎఫ్, మార్చి 26: స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో 70 రోజులు జరిగిన పర్యాటక ఎగ్జిబిషన్ ముగిసింది. మొత్తం 5.86 లక్షల మంది సందర్శించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో జనవరి 12వ తేది 51 స్టాళ్లతోఏర్పాటైన 48వ పర్యాటక వస్తు ప్రదర్శనను ప్రతిరోజు వందలాది మంది సందర్శించారు. 4,91,361 మంది పెద్దలు, 94,637 మంది పిల్లలు సందర్శించినట్లు అధికారులు తెలిపారు.

మెట్రో రైల్వేస్టేషన్ల సమీపంలో బస్ స్టాపులు

ఐసిఎఫ్, మార్చి 26: మెట్రో రైల్వేస్టేషన్ల సమీపంలో బస్ స్టాపు ఏర్పాటు చేయనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది. నగరంలో రూ.63,200 కోట్లతో రెండో విడత మెట్రోరైలు పనులు 116 కి.మీ దూరం జరుగుతున్నాయి. ఈ మార్గంలో నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ల సమీపంలో ఎంటీసీతో కలిసి బస్టాపు ఏర్పాటు చేయనున్నామని చెన్నై మెట్రోరైలు సంస్థ అధికారులు తెలిపారు.

విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, మార్చి 26: తూత్తుకుడి, మేట్టూరు థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో 420 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సేలం జిల్లా మేట్టూరులో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యంతో నాలుగు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో, నాలుగవ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కారణంగా సోమవారం అర్ధరాత్రి ఉత్పత్తికి అంతరాయం కలిగింది. అలాగే, తూత్తుకుడి జిల్లా థర్మల్ విద్యుత్ కేంద్రం మూడవ యూనిట్‌లో ఇదే సమస్య కారణంగా ఉత్పత్తి నిలిచింది.

31 నుంచి డిజి యాత్రా పథకం

ఐసిఎఫ్, మార్చి 26: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈనెల 31వ తేది నుంచి డిజి యాత్రా పథకం అమల్లోకి రానుంది. దీని ద్వారా అనుసంధానమయ్యే 14వ భారత విమానాశ్రయంగా చెన్నై విమానాశ్రయం ఉంటుందని అధికారులు తెలిపారు. భారత విమానాశ్రయ కమిషన్ తన డిజిటల్ ప్రయత్నంగా డిజి యాత్రా పథకం ద్వారా ప్రయాణికులకు ఇబ్బందులు లేని సౌకర్యం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పథకం 31వ తేది చెన్నై విమానాశ్రయంలో ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు.

బ్రైడల్ మేకప్‌పై శిక్షణ

ఐసిఎఫ్, మార్చి 26: పెళ్లి కూతురు అలంకరణపై శిక్షణకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చు. నగరంలో జరగనున్న ఈ శిక్షణలో మేకప్, బ్రైడల్ మేకప్, స్కిన్ కేర్, కలర్ కరెక్షన్, ఐ మేకప్, ఐ బ్రో, జుత్తు అలంకరణ, చీర కట్టు విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. 18 ఏళ్ల పైబడిన మహిళలు శిక్షణలో పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు నెం.8668102600, 7010143022 లలో సంప్రదించవచ్చు.

నేటినుంచి రంగనాథ ఆలయంలో పంగుణి ఉత్సవాలు

ఐసిఎఫ్, మార్చి 26: తిరునీర్‌మలైలో ఉన్న ప్రాచీన రంగనాథ పెరుమాళ్ ఆలయంలో పంగుణి ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 5వ తేది వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్వామి ఊరేగింపు నిర్వహించనున్నారు. 5వ రోజైన ఈ నెల 31వ తేది గరుడ సేవ, ఏడో రోజు రథోత్సవం జరుగనున్నాయి.

ఈరోడ్ గోడౌన్‌లో 25,000 చీరల స్వాధీనం

పెరంబూర్, మార్చి 26: ఈరోడ్‌లోని గోడౌన్‌లో దాచిన 25,000 చీరలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చిత్తోడు తిరుమగళ్ కల్యాణ్ స్టోర్స్‌కు సొంతమైన గోడౌన్‌లో అన్నాడీఎంకే అభ్యర్థి ఆట్రల్ అశోక్‌కుమార్ చీరలు దాచారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో, ఆ గోడౌన్‌లో తనిఖీలు చేపట్టిన అధికారులు, బస్తాల్లో దాచిన చీరలు స్వాధీనం చేసుకున్నారు. ఈ చీరలు ఈరోడ్ భువన టెక్స్‌టైల్స్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలియడంతో, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

కనులపండువగా రంగనాథుల కల్యాణోత్సవం


శ్రీ రంగనాయకి సమేత రంగనాథ పెరుమాళ్ కల్యాణ ఘట్టం

ప్యారీస్, మార్చి 26: స్థానిక షావుకారుపేట ముల్లా వీధిలో ప్రసిద్ధిచెందిన పురాతన శ్రీ రంగనాయకి సమేత రంగనాథ పెరుమాళ్ ఆలయంలో కోలాహలంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా కనులపండువగా కల్యాణోత్సవాన్ని వేదపండితులు లోక కల్యాణార్థం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17న ధ్వజారోహణంతో ప్రారంభం కాగా, సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో రంగనాయకి సమేత రంగనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చి మేళతాళాలు, వేద మంత్రోచ్చరణ, భక్తుల రంగ, గోవింద నామస్మరణల మధ్య కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జె.హరికుమార్ దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

వైభవంగా బన్నారి అమ్మన్ ఆలయ అగ్నిగుండ ప్రవేశ వేడుకలు


అగ్ని గుండంలోకి దిగుతున్న రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి అముద

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలోని బన్నారి మారియమ్మన్ ఆలయ అగ్నిగుండ ప్రవేశ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మంగళవారం వేకువజాము భక్తులు చేత వేపాకులు పట్టుకుని అగ్నిగుండం ప్రవేశం చేశారు. యేటా పంగుణి నెలలో ఈ వేడుకలను నిర్వహిస్తారు. ఈ నెల 11 తేదీ రాత్రి పూలగుచ్చాలు నాటే కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ప్రధాన ఘట్టమైన అగ్ని గుండ ప్రవేశం సోమవారం రాత్రి ప్రారంభమైంది. 12 అడుగుల పొడవు ఎనిమిది అడుగుల వెడల్పుతో గుండం తవ్వి అందులో కొయ్య దుంగలు వేసి ఆలయ అర్చకులు నిప్పంటించారు. మంగళవారం వేకువజాము ఆ గుండం చుట్టూ కర్పూరం వెలిగించి అమ్మవారిని ఆహ్వానించారు. మొక్కులు చెల్లించేందుకు వందలాది మంది భక్తులు పుణ్యస్నానమాచరించి చేత వేపాకులు పట్టుకుని బారులు తీరారు. తొలుత ఆలయ ప్రధాన పూజారి రాజశేఖర్, ఆలయ ఉభయదారులు, ట్రస్టీ సభ్యులు అగ్నిగుండపై నడచుకుంటూ వెళ్లారు. ఆ తర్వాత భక్తులు వారిని అనుసరించారు. చివరగా రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి అముద, ఐజీ మురుగన్, భవానీసాగర్ ఎమ్మెల్యే బన్నారి తదితరులు అగ్ని గుండంపై నడిచి వెళ్ళి తన మొక్కులను తీర్చుకున్నారు.

రూ.1,530 కోట్ల ఆస్తి పన్ను వసూలు

● జీసీసీ ప్రకటన

ప్యారీస్, మార్చి 26: నగరంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,530 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసినట్లు జీసీసీ ప్రకటించింది. జీసీసీ ఆదాయంలో ఆస్తి పన్ను ప్రధానమైనది. ఈ ఆదాయంతోనే ప్రజలకు కనీస వసతులు, ఆరోగ్య శాఖకు పనులు, చెత్త సేకరణ, వీధి దీపాల ఏర్పాటు, పార్కులు, రోడ్లకు మరమ్మతులు తదితర పనులు చేపడుతుంటారు. నగరంలో సుమారు 13.5 లక్షల మంది యజమానులు ఆస్తులకు సంబంధించిన పన్ను చెల్లిస్తున్నారు. వారి నుంచి ప్రతి ఆరు నెలలకు రూ.850 కోట్ల వంతున ఏడాదికి రూ.1,700 కోట్లు వసూలవుతోంది. మొదటి అర్ధ సంవత్సర ఆస్తి పన్ను ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30వ తేది వరకు, రెండో అర్ధ సంవత్సర ఆస్తి పన్ను అక్టోబరు 1 నుంచి మార్చి 31వ తేది వరకు చెల్లించాల్సి ఉంది. గడువులోగా ఆస్తి పన్ను చెల్లించకుంటే యజమానులు అదనంగా 1 శాతం వడ్డీతో కలిపి ఆస్తి పన్ను చెల్లించాలి. ఆ రీతిలో అర్ధ సంవత్సరం ఆస్తి పన్ను రూ.769 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను సక్రమంగా చెల్లించని యజమానులు సుమారు 150 మందిపై కోర్టులో దాఖలు చేసిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, రెండవ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నుతో కలిపి మొత్తం రూ.1,530 కోట్లు వసూలైందని జీసీసీ తెలిపింది.

ఓటరు జాబితా నుంచి 4.86 లక్షల మంది పేర్ల తొలగింపు

ఐసిఎఫ్, మార్చి 26: ఓటరు జాబితా నుంచి 4.86 లక్షల మంది పేర్లను ఎన్నికల కమిషన్ తొలగించింది. రాష్ట్రంలో తుది ఓటరు జాబితా జనవరి 22వ తేది విడుదలైంది. గత ఏడాది డిసెంబరు 10 నుంచి ఈ నెల 17వ తేది వరకు మొత్తం 17.28 లక్షల దరఖాస్తులు స్వీకరించారు. వాటిలో పేర్లు చేర్చాలని కోరిన 6.12 లక్షలు దరఖాస్తుల్లో 5.33 లక్షల దరఖాస్తులు స్వీకరించి జాబితాలో చేర్చారు. పేర్లు తొలగించాలని కోరుతూ సమర్పించిన 5.35 లక్షల దరఖాస్తుల్లో 4.86 లక్షల మందిని తొలగించారు. 26,405 దరఖాస్తులను నిరాకరించగా, 22,806 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పేరు సవరణ కోరుతూ దరఖాస్తు చేసుకున్న 5.80 లక్షల దరఖాస్తుల్లో 4.91 లక్షల దరఖాస్తులు స్వీకరించి సవరణ చేపట్టగా, 59,849 దరఖాస్తులు తిరస్కరించారు. 29,824 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

నకిలీ ఉత్తరాలు నమ్మొద్దు

● జాతీయ వైద్య కమిషన్

ఐసిఎఫ్, మార్చి 26: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పేరుతో వైద్య కళాశాలలు, వ్యక్తులకు వచ్చే నకిలీ ఉత్తరాలు నమ్మొద్దని అధికారులు తెలిపారు. కమిషన్ యూజీ విద్యా బోర్డు అధ్యక్షుడు సాంబు చరణ్‌కుమార్ సంతకం చేసిన ఉత్తరాలు తమకు అందినట్లు కొందరు ఫిర్యాదు చేశారు. వైద్యులు, వైద్యకళాశాలలకు సంబంధించిన సూచనలను కమిషన్ తన అధికారపూర్వక ఈ-మెయిల్‌లో మాత్రమే పంపుతుందని, వ్యక్తిగతంగానో, ఇతర మార్గాల్లో పంపించదని ఎన్ఎంసీ అధికారులు తెలిపారు.

రూ.40 కోట్లతో ఐసీయూ

ఐసిఎఫ్, మార్చి 26: స్థానిక రాయపేట ఆసుపత్రిలో రూ.40 కోట్లతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఏర్పాటు కానుంది. ఈ ఆసుపత్రికి ప్రతిరోజు 2,500 మందికి పైగా అవుట్ పేషంట్లు చికిత్స కోసం వస్తుంటారు. క్యాన్సర్, రోడ్డు ప్రమాదాలు, పక్షవాతం, గుండె వ్యాధుల రోగుల కోసం 834 పడకలతో ప్రత్యేక విభాగాలు పని చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రూ.40.05 కోట్లతో 100 పడకలతో ఐసీయూ ప్రారంభించనున్నామని ఆసుపత్రి డీన్ తెలిపారు.

వైభవంగా నాగరాజస్వామి కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీ నాగరాణి సమేత నాగరాజస్వామి

వేలూరు, మార్చి 26: స్థానిక పోలీసు క్వార్టర్స్ సమీపంలో ఉన్న నాగదేవత అమ్మవారి ఆలయంలో మంగళవారం నాగరాణి సమేత నాగరాజస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కోట జలకంఠేశ్వరుడి ఆలయం నుంచి అమ్మవారి ఊరేగింపు జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులు, జాతక దోషం, వివాహం అడ్డు పరిష్కారం కోసం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులను వేలాయుధం స్వామి ఆశీర్వదించారు.

వేళచ్చేరి వెస్టిన్ చెన్నైలో ఎంకేసీ వంటకాలు


ఎంకేసీ పాకశాస్త్ర ప్రవీణులు, నోరూరించే వంటకాలు

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ, ఆసియా సంప్రదాయిక వంటకాల తయారీలో పేరుగడించిన మద్రాస్ కిచెన్ కంపెనీ వేళచ్చేరిలోని వెస్టిన్ చెన్నై హోటల్‌లో కొత్త రుచుల వంటకాలతో కస్టమర్లను ఆకట్టుకుంటోంది. ఎగ్జిక్యూటివ్ చెఫ్ శరవణన్, చెఫ్ సత్యమూర్తి సమష్టి కృషితో చోళరాజుల నాటి షడ్రుచుల విభిన్నమైన వంటకాలను తయారు చేస్తున్నారు. ప్రాచీన భారతీయ వంటకాలు, పూటకూళ్లలో లభించే వంటకాల కదంబంలా ఈ వడ్డింపులు కస్టమర్లను నోరూరిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రతి వంటకం ఆనాటి పాక శ్రేష్ఠతతో పాటు పాత మద్రాసు చరిత్రను కూడా తెలియజేస్తోందని హోటల్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వంటకాల కోసం ముందస్తు బుకింగ్‌లకు నెం.8939892056లో సంప్రదించవచ్చు.

గోతిలో పడ్డ స్కూలు బస్సు

● ఆరుగురు విద్యార్థులకు గాయాలు


గోతిలో పడిన బస్సును భారీ క్రేన్ ద్వారా వెలికి తీస్తున్న కార్మికులు

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా నీలాంబూరు సమీపంలో మంగళవారం ఉదయం ఓ స్కూలు బస్సు గోతిలో పడటంతో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. నీలాంబూరు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన బస్సు నడుపాళయం, పాప్పంబట్టిల్లో విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. ఆ బస్సును కార్తీక్ నడిపాడు. జేజేనగర్ వద్ద బైకు అడ్డురావటంతో ఢీకొన ఉండేందుకు డ్రైవర్ బస్సును తిప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న 12 అడుగుల లోతు గోతిలో బోల్తాపడింది. ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కోయంబత్తూరు ఆసుపత్రికి తరలించారు.

డిస్కో బోట్ పరిచయం


కొత్తగా పరిచయం చేసిన డిస్కో బోట్

ఐసిఎఫ్, మార్చి 26: సెయ్యూరు సమీపంలోని మొదలియార్‌కుప్పం బోట్ హౌస్‌లో డిస్కో బోట్ పరిచయం చేశారు. మొదలియార్‌కుప్పంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనిచేసే రెయిన్ డ్రాప్ బోట్ హౌస్ ఉంది. ఇక్కడకు సెలవు రోజుల్లో చెన్నై, పుదుచ్చేరి నుంచి ఎక్కువగా పర్యాటకులు వస్తుంటారు. వీరు సవారీ చేసేందుకు మోటరు పడవలు, స్పీడ్ బోట్లు, తెడ్డు పడవలు వంటి అందుబాటులో ఉండగా, వేసవి సెలవులను పురస్కరించుకొని కొత్తగా డిస్కో బోట్ సేవలు పరిచయం చేశారు. మోటరు పడవకు అనుసంధానం చేసిన ఈ డిస్కో బోట్ ముందు వెళుతున్న పడవల వల్ల ఏర్పడే అలల కుదుపుల్లో కొత్త అనుభూతులు కలిగిస్తుందని, నలుగురు కూర్చొనే ఈ బోటుకు 10 నిమిషాలకు రూ.2,400 ఛార్జీ నిర్ణయించారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం


ముస్లిం ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 26: స్థానిక కార్పొరేషన్ ముస్లిం పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. కాగా పరీక్షల పర్యవేక్షణకు ప్రాథమిక విద్య అధికారి కన్నప్పన్ నేతృత్వంలో సూపర్‌వైజర్లుగా 27 మంది రెవెన్యూ అధికారులు విధులు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 103 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 9,210 మంది విద్యార్థులు, 9,460 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల విధుల్లో 2,500 మంది ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ప్రధాన విద్యాధికారి కనిమొళి, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవీంద్రన్, జిల్లా వ్యాయామ అధికారి సరస్వతి తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


అవగాహన ప్రదర్శనలో కళాకారులు

వేలూరు, మార్చి 26: పర్యావరణ పరిరక్షణ సహా పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కళా జాతాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై గ్రీన్ ట్రస్ట్ డైరెక్టర్ మార్క్ మాట్లాడుతూ... నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మొక్కల పెంపకం సహా పలు అంశాలపై కళా జాతాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా కొత్త బస్టాండ్ సమీపంలో మంగళవారం కళాజాతా నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

గుడియాత్తంలో పారామిలిటరీ బలగాల కవాతు


కవాతు ప్రదర్శనలో అధికారులు, పోలీసులు

వేలూరు, మార్చి 26: గుడియాత్తంలో మంగళవారం పారా మిలిటరీ బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఏప్రిల్ 19వ తేది లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అవసరమైన భద్రత కోసం పారా మిలటరీ బలగాలు రాష్ట్రానికి చేరుకున్నాయి. వీరు స్థానిక పోలీసులతో కలసి భద్రతా చర్యలు చేపట్టనున్నారు. గుడియాత్తం ప్రధాన వీధుల్లో సాగిన కవాతులో రెవెన్యూ తహసీల్దార్ సుబ్బులక్ష్మి, గుడియాత్తం ఏడీఎస్పీ రవిచంద్రన్, గుడియాత్తం ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాస్య నటుడు శేషు మృతి


శేషు (ఫైల్‌ఫోటో)

అడయార్, మార్చి 26: గుండెపోటుతో తమిళ సినీ హాస్య నటుడు శేషు (60) మంగళవారం మృతి చెందారు. నటుడు సంతానం హాస్య బృందం నుంచి వచ్చిన శేషు... టీవీలో ప్రసారమైన సంతానం 'లొల్లు సభ' ద్వారా పాపులర్ అయ్యారు. ఆ కార్యక్రమం నుంచే తన నట ప్రస్థానాన్ని ప్రారంభించిన శేషు... అనేక టీవీ షోల్లో నటించారు. ఆ తర్వాత చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆయన... సంతానం హీరోగా నటించిన 'ఏ1' చిత్రంతో పాటు ఇటీవల వచ్చిన 'వడకుపట్టి రామస్వామి' లో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు. ఈయన నటించిన చివరి చిత్రం కూడా ఇదే. పళ్లికరణిలో నివసిస్తూ వచ్చిన శేషుకు ఈ నెల 15వ తేదీన గుండెపోటు వచ్చింది. దీంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి. ఈయన ఉచిత వివాహాలు, పేదలకు సహాయాలు అందించారు. కాగా, శేషు మృతిపట్ల నడిగర్ సంఘం సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు ఉన్నారు.

డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్లకోమా రోగుల కోసం 29న ప్రత్యేక సదస్సు



వెబ్‌సైట్ వివరాలను ప్రకటిస్తున్న డాక్టర్ అశ్విన్ అగర్వాల్

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి నేత్ర చికిత్సలందించడంలో పేరుగడించిన డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఈనెల 29న దేశంలోనే మొట్టమొదటిసారిగా గ్లకోమా రోగుల కోసం ప్రత్యేక సదస్సును నిర్వహించనుందని ఆ ఆసుపత్రి చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్ తెలిపారు. సదస్సు గిండీలో ఐటీసీ గ్రాండ్ చోళా హోటల్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల దాకా జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనేవారికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన కంటి వైద్యనిపుణులు సలహాలను కూడా అందిస్తారని చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనదలచినవారు రూ.99ను రిజిస్ట్రేషన్ రుసుముగా చెల్లించి https://www.dragarwal.com/glaucomapatientsummit/లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలను నెం.9594901868లో సంప్రదించవచ్చన్నారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ క్లినికల్ సర్వీసెస్ జోనల్ హెడ్ డాక్టర్ కళాదేవి సతీష్, రీజనల్ హెడ్ డాక్టర్ ఎస్ సౌందరి, గ్లకోమా స్పెషలిస్ట్ సుగ్రీప్రియా పాల్గొన్నారు.


మంగళవారం చెన్నైలో ఎండీఎంకే అధినేత వైగోను మర్యాదపూర్వకంగా కలుసుకున్న విరుదునగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్కం ఠాగూర్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వం పెరుందగై, సీనియర్ నేత చిరంజీవి తదితరులు


వేలూరు కాట్పాడిలో ఉన్న ఈసీ ఎడ్యుకేషన్ సర్వీస్ కేంద్రంలో ప్లస్‌టూ విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కార్యక్రమం మంగళవారం ప్రారంభం కాగా, విద్యార్థులకు సూచనలు, సలహాలు అందిస్తున్న డాక్టర్ ఛార్లెస్

గ్రూమ్ ఇండియా సెలూన్ ప్రచారకర్తగా స్మృతి మంధాన



అడయార్, మార్చి 26: క్రికెట్ సంచలనం, ప్రముఖ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన గ్రూమ్ ఇండియా సెలూన్ అండ్ స్పా క్లినిక్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ఈ క్లినిక్‌కు సంబంధించి డైరెక్ట్ టు కన్స్యూమర్ (డీ2సీ) స్కిన్ కేర్ ఉత్పత్తులపై ప్రచారం చేస్తారు. ఇదే విషయంపై నేచురల్స్ సెలూన్ సీఈవో, కో-ఫౌండర్ సీకే కుమారవేల్ మాట్లాడుతూ... రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మహిళా జట్టు కెప్టెన్ స్మృతి మంధానని తమ ఉత్పత్తుల ప్రచారం కోసం ప్రచారకర్తగా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

దక్షిణ చెన్నైకు ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టో

● బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందర్‌రాజన్



ప్యారీస్, మార్చి 26: దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించినట్లు ఆ స్థానంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, మాజీ గవర్నర్ తమిళిసై అన్నారు. కోడంబాక్కం మహాలింగపురంలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాజధాని నగరాన్ని సింగార 2.0గా సింగపూర్‌లా తీర్చిదిద్దుతామని గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన డీఎంకే నెరవేర్చలేదన్నారు. మార్పు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, తాను నిష్పక్షపాతంగా ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతోనే రెండు రాష్ట్రాల్లో ఉన్నతంగా భావించిన గవర్నర్ పదవి వదులుకొని మళ్లీ రాజకీయ ప్రవేశం చేశానన్నారు.

ఉచిత బస్సు సేవలు ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ బాలాజి

వేలూరు, మార్చి 26: స్థానిక శ్రీ పురం నారాయణ ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం ఉచిత బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ఈ బస్సును ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీక్ అవర్స్‌లో నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఉదయాన్నే ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా ఉచిత బస్సు ప్రారంభించామని తెలిపారు. గ్రీన్ సర్కిల్ నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరే బస్సు పాత బస్టాండ్, రాజా థియేటర్, రౌండ్ ఠానా, టోల్‌గేట్, తొరప్పాడి ఎంజీఆర్ విగ్రహం, అరియూరు తదితర ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగిస్తుందని తెలిపారు. నెం.9994212859లో సంప్రదించి ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చని బాలాజీ తెలిపారు.

'రెండాకులు' గుర్తును స్తంభింపజేయండి

● ఈసీకి ఓపీఎస్ వినతి

పెరంబూర్, మార్చి 26: తనకు 'రెండాకులు' గుర్తు కేటాయించాలని, లేకపోతే ఆ గుర్తు స్తంభింపజేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం వినతిపత్రం అందజేశారు. రెండాకులు స్తంభింపజేసినట్లయితే తనకు బక్కెట్ గుర్తు కేటాయించాలని ఓపీఎస్ విజ్ఞప్తి చేశారు. కాగా, బీజేపీ కూటమిలో భాగంగా రామనాథపురం లోక్‌సభ నియోకవర్గంలో స్వతంత్య అభ్యర్థిగా ఓపీఎస్ పోటీచేస్తున్న విషయం తెలిసిందే.

శుభ శుక్రవారం, వారాంతపు సెలవులు

● చెన్నై నుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మార్చి 26: శుభ శుక్రవారం, వారాంతపు సెలవుల సందర్భంగా నగరం నుంచి పలు నగరాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ తెలిపింది. కీలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు 28వ తేది 505 బస్సులు, 29న 300 బస్సులు, 30వ తేది 345 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి నాగపట్టినం, వేలాంకన్ని, హోసూరు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు 28 నుంచి 30వ తేది వరకు అదనంగా 120 బస్సులు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర నగరాల నుంచి ఇతర ప్రాంతాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

నీటమునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

పెరంబూర్, మార్చి 26: చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీపంలో నీటమునిగి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ప్లస్ వన్ చదువుతున్న ప్రవీణ్, మహమ్మద్ సాధిఖ్ సహా 11 మంది విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం మధురాంతకం సమీపంలో సముద్రతీరానికి వెళ్లారు. వారందరూ సరదాగా మునుగుతున్న సమయంలో ప్రవీణ్, సాధిఖ్ భారీ అలకు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

పర్యాటకురాలికి నగదు అప్పగింత

పెరంబూర్, మార్చి 26: ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదును మంగళవారం బాధిత పర్యాటకురాలికి అప్పగించారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రూ.50 వేలకు మించి తీసుకెళ్లే నగదుకు తగిన దస్తావేజులు చూపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, పంజాబ్‌కు చెందిన మహిళ కుటుంబసభ్యులతో నీలగిరి జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం ఊటీకి వెళ్తున్న కారును అడ్డుకొని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఆమె వద్ద ఉన్న రూ.69,000 నగదు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో, స్వాధీనం చేసుకున్న నగదుకు తగిన దస్తావేజులు చూపించడంతో బాధిత మహిళకు నగదు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.



● సెంటిమెంట్ టచ్

కుటుంబంతో నామినేషన్ దాఖలు


నామినేషన్ దాఖలులో గోపినాథ్

ప్యారీస్, మార్చి 26: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే కూటమి తరఫున పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ సెంటిమెంట్‌ను నమ్ముతారు. ఆయన సోమవారం తన సతీమణి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలసి కృష్ణగిరి కలెక్టర్ కార్యాలయానికి నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లారు. నామినేషన్ సమయంలో మిగతా పార్టీల అభ్యర్థులు మిత్రపక్షాల నేతలను వెంటబెట్టుకొని వెళుతుంటారు. అయితే గోపినాథ్ అలా కాకుండా ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా తన సతీమణి కవితతో నామినేషన్ దాఖలు చేయించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ... నేను ఇప్పటివరకు పోటీ చేసిన నాలుగు సార్లు నా కుటుంబసభ్యులతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశాను. ఇప్పుడు కూడా అదే చేశాను. ఇది నా సెంటిమెంట్. నేను డీఎంకే కూటమి తరఫున పోటీ చేస్తున్నాను. ప్రచారం అంతా కూటమి నేతలతో కలిసే ఉంటుంది. మా కుటుంబం సెంటిమెంట్ గురించి కృష్ణగిరి జిల్లాలో అందరికీ తెలుసు.

● ధనిక అభ్యర్థులు

ఈరోడ్ అన్నాడీఎంకే అభ్యర్థి ఆస్తులు రూ.582 కోట్లు


ఈరోడ్ అన్నాడీఎంకే అభ్యర్థి అశోక్‌కుమార్

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరఫున పోటీ చేస్తున్న ఆట్రల్ అశోక్‌కుమార్ రూ.582.95 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారు. ఈ మేరకు నామినేషన్‌తోపాటు సమర్పించిన పట్టికలో పేర్కొన్నారు. భార్య కరుణాంబికకు రూ.69.98 కోట్ల ఆస్తులున్నట్లు తెలిపారు. ఆట్రల్ పేరుతో ట్రస్టును నడుపుతున్న అశోక్‌కుమార్ పలు విద్యా సంస్థల అధినేత. నామినేషన్ అఫిడవిట్‌లో తనను సంఘసేవకుడు, పారిశ్రామికవేత్త అని ప్రకటించుకున్నారు. గతంలో బీజేపీ ఓబీసీ ఉపాధ్యక్షుడిగా పని చేసిన అశోక్‌కుమార్ గత నవంబర్‌లోనే అన్నాడీఎంకేలో చేరారు.

శివగంగ బీజేపీ అభ్యర్థి ఆస్తులు రూ.305 కోట్లు...

శివగంగ బీజేపీ అభ్యర్థి దేవనాథన్‌కు రూ.305 కోట్ల మేరకు ఆస్తులున్నాయి. రూ.149.27 కోట్ల మేరకు చరాస్తులు, రూ.37.30 కోట్ల స్థిరాస్తులున్నాయి. ఆయన భార్య పేరుపై రూ.38.17 కోట్ల ఆస్తులున్నాయి. ఈ మేరకు నామినేషన్‌తో పాటు ఆస్తుల జాబితాను జత చేశారు. ఈ నియోజకవర్గంలోనే పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరం రూ.96 కోట్ల మేరకు ఆస్తులు కలిగి ఉన్నారు. తనకు రూ.30.26 కోట్ల విలువైన చరాస్తులు, రూ.24.73 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. భార్య శ్రీనిధి పేరుతో కూ.12.26 కోట్ల చరాస్తులు, రూ.29 కోట్ల విలువైన స్థిరాస్తులున్నాయి. ఇక అన్నాడీఎంకే అభ్యర్థి జేవియర్ దాస్ రూ.6.66కోట్ల మేరకు ఆస్తులు కలిగి ఉన్నారు. తిరుచ్చిలో పోటీ చేస్తున్న ఎండీఎంకే దురై వైగోకు రూ.35.90 కోట్ల ఆస్తులు, ప్రత్యర్థి అన్నాడీఎంకే అభ్యర్థి కరుప్పయ్యాకు రూ.2.82 కోట్ల మేరకు ఆస్తులున్నాయి.


తేని లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమిలో పోటీ చేస్తున్న అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థి టీటీవీ దినకరన్ ప్రచారం


ధర్మపురి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమిలో పోటీచేస్తున్న పీఎంకే అభ్యర్థి సౌమ్య తరఫున 'మామిడి పండు' గుర్తు చూపిస్తూ ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అన్బుమణి రాందాస్


తిరువణ్ణామలైలో డీఎంకే అభ్యర్థి సీఎన్ అన్నాదురైకి మద్దతుగా ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధి

తూత్తుకుడిలో కనిమొళికి మద్దతుగా

స్టాలిన్ ఓట్ల వేట

● చెల్లెలి కోసం...


తూత్తుకుడి కూరగాయల మార్కెట్‌లో కాలినడకనే వెళ్ళి ఓట్లవేట సాగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా రెండోసారి పోటీ చేస్తున్న కనిమొళికి మద్దతుగా ఆమె సోదరుడు, డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ మంగళవారం ఉదయం ఓట్ల వేట సాగించారు. తూత్తుకుడి ప్రైవేటు గెస్ట్‌హౌస్ నుంచి వాకింగ్‌కు బయలుదేరిన స్టాలిన్... కనిమొళి, మంత్రులు గీతా జీవన్, అనితా రాధాకృష్ణన్, మేయర్ జగన్ పెరియసామి, పార్టీ స్థానిక నాయకులను వెంటబెట్టుకుని కామరాజర్ కాయగూరల మార్కెట్‌కు వెళ్ళి అక్కడి వ్యాపారులకు కరపత్రాలిచ్చి ఓటేసీ తన సోదరి కనిమొళిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి జామియా మసీదు రోడ్డుకు చేరుకున్నారు. కాలినడకన వెళ్లి స్థానికులకు నమస్కరిస్తూ డీఎంకేని గెలిపించమని కోరారు. ప్రతిచోటా స్టాలిన్‌కు స్థానికులు ఘన స్వాగతం పలికారు. పలువురు యువతీ యువకులు స్టాలిన్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. లయన్స్ టౌన్ ప్రాంతంలో ఇళ్ళ బయటనిలిచిన మహిళలతో కబుర్లాడారు. మార్గమధ్యంలో నూసై దబ్బాస్ అనే జాలరి ఇంట్లో స్టాలిన్, కనిమొళి, మంత్రులు గీతాజీవన్, అనితా రాధాకృష్ణన్ తేనీరు తాగారు. అక్కడి నుంచి ఓపెన్‌టాప్ వ్యాన్‌లో కనిమొళి, స్టాలిన్ తూత్తుకుడి నగరమంతటా తిరిగి ఓట్లవేట సాగించారు. ఇదిలా ఉండగా తూత్తుకుడి డీఎంకే అభ్యర్థిగా కనిమొళి మంగళవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి మంత్రులు గీతాజీవన్, అనితా రాధాకృష్ణన్‌ను వెంటబెట్టుకుని వెళ్లి నామినేషన్ సమర్పించారు. ఆ తర్వాత కనిమొళి మాట్లాడుతూ... తూత్తుకుడిలో ఈ సారి మునుపటి కంటే అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.


ఓ జాలరి ఇంట మంత్రి గీతా జీవన్, అనితా రాధాకృష్ణన్, ఎంపీ కనిమొళితో కలిసి టీ తాగుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్


తూత్తుకుడి నియోజకవర్గం డీఎంకే అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తున్న కనిమొళి

● ప్రజాస్వామ్య పరిరక్షణ

ఆరు ఓట్ల కోసం ఓ పోలింగ్ కేంద్రం



చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపం వెళ్లిమలైలో ఆరుగురు ఓటర్ల కోసం ఓ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వెళ్లిమలై ఎస్టేట్ ప్రాంతంలో సుమారు 500 కుటుంబాలు నివసిస్తుండేవి. ఆ ప్రాంతంలోని తేయాకు ఎస్టేట్ పరిశ్రమ దెబ్బతినడంతో కార్మికులంతా ఉపాధి కోల్పోయారు. అందరూ వలస వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు మాత్రమే నివసిస్తున్నారు. ఆ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రలో లోక్‌సభ ఎన్నికల్లో 35 ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 12 ఓట్లు పోలయ్యాయి. ఏప్రిల్ 19న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పోలింగ్ కేంద్రంలో ఆరుగురు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఆరుగురు ఓటర్లు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రంలో సిబ్బంది, భద్రతకు పోలీసులను నియమించే పనులు జరుగుతున్నాయి.


చిదంబరం ఆలయంలో దైవదర్శనం చేసుకుని వెలుపలకు వస్తున్న బీజేపీ అభ్యర్థి కాత్యాయిని

● దేవుడి మీద ఒట్టేసి చెబుతున్నా

చిదంబరం ఆలయాన్ని కాపాడుతా

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చిదంబరం నటరాజస్వామి ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా అడ్డుకుంటానని ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కాత్యాయిని ప్రకటించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి విస్తృతంగా ప్రచారం చేసి గెలుస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

అందరి దృష్టి కోయంబత్తూరు వైపే!

పార్టీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పాలకపక్షం డీఎంకేను తీవ్రంగా విమర్శలు చేస్తూ, 'డీఎంకే ఫైల్స్' పేరుతో వంతులవారీగా 'డీఎంకే మంత్రుల అవినీతి అక్రమాలివిగో' అంటూ ఆడియో, వీడియోలు వెలువరించి కలకలం సృష్టిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి వాణిజ్యనగరం కోయంబత్తూరును ఎంచుకోవడంతో అందరూ ఆ నగరం వైపే దృష్టి సారిస్తున్నారు. అంగబలం, ఆర్థికబలం మెండుగా కలిగిన పాలకపక్షం డీఎంకే అభ్యర్థి గణపతి పి.రాజ్‌కుమార్, అన్నాడీఎంకే అభ్యర్థి సింగై రామచంద్రన్‌తో అన్నామలై ఢీకొట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. - చెన్నై, ఆంధ్రజ్యోతి

● సమ ఉజ్జీల సమరాంగణం

7 సార్లు వామపక్షాల గెలుపు...

1952 నుంచి కోయంత్తూరు లోక్‌సభ నియోజకవర్గానికి 17 సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు సార్లు, వామపక్షాలు ఏడుసార్లు, డీఎంకే రెండు సార్లు, బీజేపీ రెండు సార్లు అన్నాడీఎంకే ఓసారి గెలిచాయి. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీలు పోటీ చేస్తున్నాయి. డీఎంకే తరఫున కోయంబత్తూరు కార్పొరేషన్ మాజీ మేయర్ గణపతి పి. రాజ్‌కుమార్, అన్నాడీఎంకే తరఫున ఆ పార్టీ సాంకేతిక విభాగ అధ్యక్షుడు సింగై రామచంద్రన్, బీజేపీ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పోటీ చేస్తున్నారు.

● 2014 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థి పి.నాగరాజన్ 4,31,717 ఓట్లతో గెలిచారు. బీజేపీ అభ్యర్థి, ప్రస్తుత జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ 3,89,701 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు. డీఎంకే అభ్యర్థి గణేష్‌కుమార్ 2,17,083 ఓట్లతో తృతీయ స్థానం దక్కించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆర్. ప్రభు 56,962, సీపీఎం అభ్యర్థి పీఆర్ నటరాజన్ 34,197 ఓట్లు పొందారు.

● 2019 ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన సీపీఎం అభ్యర్థి పీఆర్ నటరాజన్ 5,71,150 ఓట్లతో గెలిచారు. బీజేపీ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 3,82,037 ఓట్లు పొంది ద్వితీయ స్థానం సంపాదించుకున్నారు. మక్కల్ నీదిమయ్యం అభ్యర్థి మహేంద్రన్ 1,45,104 ఓట్లు పొంది తృతీయ స్థానంలో నిలిచారు. నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి కల్యాణసుందరంకు 60,519 ఓట్లు లభించాయి. ఆ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థికి 45.66 శాతం ఓట్లు లభించగా, బీజేపీకి 31.34 శాతం ఓట్లు, మక్కల్ నీదిమయ్యంకు 11.6 శాతం ఓట్లు, నామ్ తమిళర్ కట్చికి 4.84 శాతం ఓట్లు లభించాయి. ఆ ఎన్నికల్లో సీపీఎం, మక్కల్ నీదిమయ్యం పార్టీలు పొందిన ఓటు బ్యాంక్ ఈ ఎన్నికల్లో చెక్కుచెదరకుండా ఉంటే డీఎంకే అభ్యర్థి గణపతి పి.రాజ్‌కుమార్ 50 శాతానికి పైగా ఓట్ల మెజారిటీతో సునాయాసంగా గెలుస్తారని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

సీఎం జయలలిత హయాంలో అన్నాడీఎంకే తరఫున కోయంబత్తూరు మేయర్ పదవికి పోటీ చేసిన గెలిచినగణపతి పి.రాజ్‌కుమార్ 2020లో డీఎంకేలో చేరారు. 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న శాసనసభ నియోజకవర్గాలలో నామ్‌తమిళర్ కట్చి ప్రత్యేక ఓటు బ్యాంక్‌ను పొంది తృతీయ స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ డీఎంకే ఓట్లను చీల్చితే అన్నాడీఎంకే, లేదా బీజేపీ సానుకూలంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు ఒక వేళ ఆ పార్టీ అన్నాడీఎంకే, బీజేపీ ఓటు బ్యాంకులకు గండి కొడితే అది పాలకపక్షం డీఎంకేకు సానుకూలంగా మారుతుంది. కోయంబత్తూరు నియోజకవర్గంలో కొంగు వేలాలర్, అరుంధతీయులు, నాయుడు కులస్తులు ఎక్కువగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 12 శాతం వరకు ఉన్న ముస్లింలు, క్రైస్తవులు డీఎంకేకు మద్దతిస్తే ఆ పార్టీ అభ్యర్థి గెలుపు సునాయాసమవుతుంది. కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కోయంబత్తూరు సౌత్ శాసనసభ నియోజకవర్గం మినహా తక్కిన ఐదు శాసన సభ నియోజకవర్గాలలో అన్నాడీఎంకే 40 శాతం వరకు ఓటు బ్యాంక్‌ను కలిగి ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మిత్రపక్షమైన బీజేపీకి అవకాశమిచ్చి ఓటమిపాలైనా ఆ తర్వాత 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కోయంబత్తూరు జిల్లాలోని 10 శాసనసభ నియోజకవర్గాలకు తొమ్మిదింట్లో అన్నాడీఎంకే గెలిచి రికార్డు నెలకొల్పింది. కోయంబత్తూరు సౌత్ నియోజకవర్గంలో అన్నాడీఎంకే మిత్రపక్షం బీజేపీ గెలిచింది. 2022లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కోయంబత్తూరు కార్పొరేషన్‌లోని 100 వార్డులకు గాను 96 వార్డులలో అన్నాడీఎంఏ ఓటమి పాలైంది. ఆ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి మంచి పలుకుబడిని కలిగి ఉన్నారు. పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్నారు. తొలుత ఈ నియోజకవర్గానికి మాజీ మేయర్, మాజీ మంత్రి వేలుసామిని అభ్యర్థిగా ఎంపిక చేస్తారని అందరూ అనుకున్నారు. అయితే అన్నాడీఎంకే అధిష్ఠానం సింగై రామచంద్రన్‌కు టిక్కెట్ ఇచ్చింది. ఈయన 1991-96 మధ్య సింగానల్లూరు ఎమ్మెల్యేగా పని చేసిన సింగై గోవిందరాజు కుమారుడు.


డీఎంకే అభ్యర్థి గణపతి పి.రాజ్‌కుమార్, బీజేపీ అభ్యర్థి అన్నామలై, అన్నాడీఎంకే అభ్యర్థి సింగై జి.రామచంద్రన్

● వీఐపీ నియోజకవర్గం



1989 నుంచి బీజేపీ పయనం...

కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ రాజకీయ పయనం 1989లో ప్రారంభమైంది. 1989లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 2.23 శాతం, 1991లో 6.78 శాతం, 1996లో 5.30 శాతం ఓట్లు పొందిన బీజేపీ... కోయంబత్తూరు నగరంలో బాంబు పేలుడు సంఘటనల తర్వాత ఓటు బ్యాంక్ గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఆ మేరకు 1998లో అన్నాడీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 55.85 శాతం ఓట్లు పొంది గెలిచారు. ఆ తర్వాత 1999లో డీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన సీపీ రాధాకృష్ణన్ 4,39,068 ఓట్లు (49.21శాతం) పొంది గెలిచారు. అటుపిమ్మట 2004లో ఆయన ఓటమిపాలై 38.74 శాతం ఓట్లు పొంది రెండోస్థానంలో నిలిచారు. 2009లో పంచముఖ పోటీలో బీజేపీ అభ్యర్థి జీకే ఎస్ సెల్వకుమార్ 37,909 (4.61శాతం) ఓట్లు పొందారు. 1989 నుండి 2019 వరకు బీజేపీ హెచ్చుతగ్గులకు గురవుతూ వచ్చినా ఆ పార్టీ కంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు కలిగి ఉంటోంది. ఇంతటి చరిత్ర కలిగిన కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పోటీకి దిగడంతో ఆ పార్టీ శ్రేణుల సంతోషానికి పట్టపగ్గాలు లేకున్నాయి. ఎన్ మన్ ఎన్ మక్కళ్ పేరుతో అన్నామలై జరిపిన పాదయాత్ర, కోయంబత్తూరులో ఇటీవలే ప్రధాని మోదీ జరిపిన రోడ్‌షో బీజేపీ విజయానికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో 1962, 1980, 1995, 1998, 2014 ఎన్నికల్లో డీఎంకే పోటీ చేసి 1980, 1996 ఎన్నికల్లో గెలిచింది. ఈ నేపథ్యంలో 28 యేళ్ల తర్వాత డీఎంకే, పదేళ్ల తర్వాత అన్నాడీఎంకే, 25 యేళ్ల తర్వాత బీజేపీ ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో ప్రధానమైన మూడు పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు ఒకరికొకరు ఏమాత్రం తీసిపోని సమ ఉజ్జీలుగా ఉన్నారని చెప్పడం అతిశయోక్తి కాదు.


కృష్ణగిరి నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న విద్యారాణి

● మేడమ్ చెబుతున్నారు మరి!

గిరిజనుల అభివృద్ధికి పాటుపడతా

చెన్నై, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి నియోజకవర్గం లోక్‌సభ సభ్యురాలిగా గెలిస్తే రైతులు, గిరిజనుల అభివృద్ధి కోసం పాటుపడతానని స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి అన్నారు. బీజేపీలో చేరి ఒకటిన్నర సంవత్సరంపాటు ఆ పార్టీకి తనవంతు సేవలను అందించానని, అయితే తనకు గుర్తింపు ఇవ్వకపోవడంతో ఆ పార్టీని విడిచిపెట్టాల్సి వచ్చిందన్నారు. తన తండ్రి కావలిదైవంగా కృష్ణగిరి జిల్లా వాసులందరినీ కాపాడినట్లు ఆమె తెలిపారు. బలహీనవర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ లక్ష్యాలు తనకు నచ్చడంతో ఆ పార్టీలో చేరానని తెలిపారు. ప్రచారంలో ఏ పార్టీనీ వ్యతిరేకిస్తూ మాట్లాడనని, నియోజకవర్గంలో తాను చేపట్టనున్న పథకాలు గురించి వివరిస్తూ ప్రచారం చేస్తానని ఆమె తెలిపారు.

'ఆ' సీన్లు ఉన్న సినిమాలకే ఓటీటీల మద్దతు

చిత్రజ్యోతి

● దర్శకుడు ఉదయకుమార్

ఇటీవల సినిమాను ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ కొనుగోలు చేస్తే థియేటర్‌లో విడుదల చేసే పరిస్థితి ఏర్పడిందని, ఓటీటీ సంస్థలు కూడా చాలా సన్నిహితంగా ఉండే (రొమాన్స్) సీన్లు ఉన్న సినిమాలనే కొనుగోలు చేస్తున్నాయని సీనియర్ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి. ఉదయకుమార్ అన్నారు. ప్రతాప్ ఎంటర్‌ప్రైజెస్ నిర్మాణంలో నిర్మాత ప్రతాప్ నిర్మించిన చిత్రం 'ఇరవిన్ కణ్గల్'. పాప్ సురేష్ దర్శకుడు. పాప్ సురేష్, డాలీ ఐశ్వర్య, గిరి ద్వారకిష్ నటించగా, చార్లెస్ ధన సంగీతం అందించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు, మనిషికి ఉన్న సంబంధాన్ని తెలిపే సైన్స్ మూవీగా తెరకెక్కించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను సోమవారం రాత్రి చెన్నైలో విడుదల చేశారు. సీనియర్ దర్శకుడు ఉదయకుమార్, పేరరసుతో పాటు పలువురు సినీ ప్రముఖులు, చిత్రబృందం ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయకుమార్ మాట్లాడుతూ... 'హాలీవుడ్‌లో ఏఐ టెక్నాలజీ ఉపయోగించి సినిమాలు తీయకుండా నిషేధం విధించారు. కానీ, పాప్ సురేష్ ఇదే టెక్నాలజీని ఉపయోగించి మనిషికి, ఏఐ టెక్నాలజీ(కృత్రిమ మేధ)కి ఉన్న సంబంధాన్ని వివరిస్తూ సినిమా తీయడాన్ని అభినందిస్తున్నా. ఇటీవల ఓటీటీల హవా కొనసాగుతుంది. అనేక చిత్రాలు ఓటీటీలు కొనుగోలు చేసిన తర్వాతే విడుదల చేస్తున్నారు. ఓటీటీలకు 'ఆ' సీన్లు ఉన్న సినిమాలే కావాలి. ఇండిపెండెంట్ ఆల్బమ్ సాంగ్‌లలో కూడా ఆ తరహా సీన్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఎమోషనల్, సెంటిమెంట్ చిత్రాలకు ఆదరణ లేదు. యువ ప్రతిభావంతులైన దర్శకులు మంచి కథతో సినిమాలు తీసేందుకు ముందుకురావాలి' కోరారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ... 'కొందరు దర్శకులు స్టోరీ చెప్పినట్టుగా సినిమాలు తీయడం లేదు. ఇదే అసలు సమస్య. అందుకే అనేక చిత్రాలకు ఆదరణ లేకుండా పోతుంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. హీరో పాప్ సురేష్ మాట్లాడుతూ... 'చిన్న బడ్జెట్‌తో ప్రారంభించిన ఈ చిత్రం పెద్ద బడ్జెట్ స్థాయికి చేరుకుంది. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో రూపొందించాం. ప్రతి ఒక్కరూ ఆదరించాలి' అన్నారు. నిర్మాత ప్రతాప్ మాట్లాడుతూ... 'చిన్న బడ్జెట్‌తో నిర్మించినప్పటికీ భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. థియేటర్లు తక్కువగా లభించినప్పటికీ మీడియా మిత్రులు మనసుపెట్టి పెద్ద హిట్ చేయాలి' అని కోరారు. అలాగే, చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు. కాగా, ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5వ తేదీన విడుదల చేస్తున్నారు.



ఆడియో రిలీజ్ దృశ్యం